

కథా కౌముది

ఉలి తొకని శిల్పం — సురేష్ రావి

రత్నగిరి... సాటిలేని సామ్రాజ్యం. కళలకు కాణాచి. ముఖ్యంగా శిల్ప కళలో దానికి సాటి మరొకటి లేదనే చెప్పాలి. అద్భుతమైన శిల్పకళతో వర్ధిల్లుతున్న రత్నగిరిలో ఏ వీధి చూసినా ఆకాశాన్ని తాకే గోపురాలు, ప్రాణం ఉట్టిపడే విగ్రహాలు, నాట్యం చేస్తున్నట్లుండే శిలాబాలికలే. ఏది ప్రాణం లేని శిల్పమో, ఏది ప్రాణమున్న రూపమో గుర్తించడం సామాన్యులకు సాధ్యం కాదు. శిల్పకళతో అది ఇంత ప్రసిద్ధి చెందడానికి ముఖ్య కారణం విరించి. రత్నగిరి సామ్రాజ్యపు ఆస్థాన శిల్పి.

విరించి సామాన్యుడు కాదు. బ్రహ్మ మట్టితో ప్రాణికోటిని సృష్టిస్తే, విరించి శిలలతో దైవత్వాన్ని మలిచేవాడు. అతని ఉలి రాయిని తాకితే, కఠిన శిల సైతం అతని ఉలి తాకిడికి వెన్నలా కరిగి లొంగిపోతుందా అన్నట్లుండేది. "అతడు మలిచిన ఏనుగు శిల్పం ఘీంకరిస్తోందా అన్నట్లు, అతను చెక్కిన పువ్వును చూస్తే ఇంత చక్కని పువ్వు నుండి వాసన రాదేమిటా అని ఆశ్చర్యం గొలిపేలా భ్రమ కలుగుతుంది. ఒకసారి అతను నల్లరాతితో తామర పువ్వును చెక్కాడు. అది ఎంత సహజంగా ఉందంటే, ఎప్పటికప్పుడు తోటలో ఎగురుతున్న తుమ్మెదలు వచ్చి ఆ రాతి పువ్వు మీద వాలడానికి ప్రయత్నించి, తమ రెక్కలు విరగ్గొట్టుకుంటున్నాయి. అంతటి గొప్ప నైపుణ్యం అతనిది. రత్నగిరిలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల రాజ్యాలన్నిటిలో కూడా అతని పేరు మారుమోగుతోంది.

రత్నగిరి చక్రవర్తి విజయవర్మకు విరించి అంటే చాలా ఇష్టం. "మన రాజ్యపు సరిహద్దులు దాటినా, తరాలు మారినా నాకు విలువ ఉండకపోవచ్చు, కానీ నీ శిల్పాలకు రాజ్యమనే హద్దు, కాలమనే సరిహద్దు లేదు విరించీ," అని తరచూ అంటూ ఉంటాడాయన.

ధనం, కీర్తి, గౌరవం... అన్నీ విరించి కాళ్ళ దగ్గర ఉండేవి. చక్రవర్తి అతనికి "శిల్పకళా ప్రవీణ" అనే బిరుదునిచ్చాడు. కానీ విరించికి మాత్రం అవేవీ సంతోషాన్ని ఇవ్వడం లేదు. మనసులో ఏదో తెలియని వెలితి. ఒక వర్షం పడిన సాయంత్రం, విరించి తన మండపంలో కూర్చుని ఉన్నాడు. బయట ఒక ఇనుప స్తంభం ఉంది. సాయంత్రపు సూర్యుడి ఎర్రటి కాంతి ఆ స్తంభం మీద పడింది. ఆ స్తంభం చూడటానికి తుప్పు పట్టి, వికారంగా ఉంది. కానీ... దాని నీడ మాత్రం వెనక గోడ మీద రాజసంగా కనిపిస్తుంది.

విరించి ఉలికిపడ్డాడు. "స్తంభం తుప్పు పట్టి ఉండవచ్చు, కానీ అది సూర్యకాంతిని అడ్డుకుంటున్న తీరులో ఒక క్రమశిక్షణ ఉంది. వస్తువు వికారంగా ఉంటే నీడ వికారంగానే ఉంటుంది అనేది సామాన్యుల ఊహ. కానీ, ఒక కోణంలో ఉన్నప్పుడు వికృతంగా కనిపించే నీడ మరో కోణంలో అద్భుతమైన సౌందర్యాన్ని పుట్టిస్తుంది. మరి నీడనే సౌందర్యంగా మలిస్తే...? అందమైన శిల్పానికి జీవమున్న రాయి కావాలి. ఉలికి లొంగిపోయే అదును దానికి ఉండాలి. కానీ నీడకు? రాయిగానీ, వస్తువుగానీ ఎలా ఉన్నా, దాని ఆత్మ నీడ రూపంలోనే బయటపడుతుంది. దానికి ఆకారం ఉంటుంది కానీ బరువు ఉండదు. దాన్ని ముక్కలు చేయలేం, దొంగిలించలేం, పట్టుకోలేం, కానీ చూడగలం. అది కాంతి ఉన్నంత వరకే బతికి ఉంటుంది. అందంగా ఉండక్కర్లేదు, అసలైన అందం రాయిలో లేదు... అది కాంతిని ఎంత లయబద్ధంగా అడ్డుకుంటుంది అనేదే ముఖ్యం. ఆ రాయి అడ్డుపడటం వల్ల ఏర్పడే చీకటిలో ఉండే స్వచ్ఛతే నిజమైన శిల్పం." ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఆ రోజు నుండి, అతను పగలు మొత్తం రాళ్లు చెక్కుతున్నాడు, కానీ రాత్రి కాగానే ఆ విగ్రహాల ముందు దీపం పెట్టి గంటల తరబడి వాటినే చూస్తూ కూర్చుంటున్నాడు. అతన్ని చూసి అందరూ "తన కళను తానే ఆరాధించుకుంటున్నాడు" అనుకుంటున్నారు. కానీ విరించి చూస్తున్నది విగ్రహాలని కాదు, ఆ విగ్రహాల వెనక గోడ మీద పడుతున్న నీడలను.

కాలం గడిచేకొద్దీ అతనికి ఒక విచిత్రమైన కోరిక పుట్టింది. వెంటనే అతను ఒక నిర్ణయానికి వచ్చి చక్రవర్తి దగ్గరకు వెళ్ళాడు.

"మహారాజా! నేను ఇకపై సాధారణ విగ్రహాలు చెక్కదలుచుకోలేదు," అని ప్రకటించాడు విరించి.

సభలో నిశ్శబ్దం ఆవరించింది. "మరి ఏం చేస్తావు విరించీ?" అని విజయవర్మ ఆశ్చర్యంగా అడిగాడు.

"మహారాజా, నేను ఇకపై ఉలితో రాతిని చెక్కను. నేను కాంతితో శూన్యాన్ని చెక్కుతాను," అన్నాడు.

విజయవర్మకు అర్థం కాలేదు. "ఏం చెప్తున్నావు విరించీ?" అని అడిగాడు.

"మహారాజా! ఇప్పటివరకు నేను శిలకు రూపం ఇచ్చాను. కానీ ఇప్పుడు ఆ శిలను సాక్షిగా నిలబెట్టి, అది అడ్డుకునే కాంతిలో దేవతను వెతకాలనుకుంటున్నాను. కంటికి కనిపించే రాయి కంటే, కంటికి దొరకని ఆ నీడలోనే అనంతమైన సౌందర్యం దాగి ఉందని నా నమ్మకం. ఇక్కడ రాయి ఒక నిమిత్తం మాత్రమే, అది చూపించే నీడ మాత్రమే సత్యం. రాయిని తాకవచ్చు, నీడను తాకలేం. ఈసారి నేను స్పర్శకు దొరకని సౌందర్యాన్ని సృష్టించబోతున్నాను. అది కాంతి ఉన్నంతవరకే జీవిస్తుంది, కాంతి పోతే మాయమవుతుంది. ఆ క్షణికమైన సత్యమే నా జీవితకాలపు తపస్సు. నేను నీడను చెక్కుతాను... ఇది ఉలి తాకని శిల్పం___ కాంతి మలిచే దైవత్వం!"

సభలో ఉన్న ఇతర శిల్పులు నవ్వారు. "నీడను చెక్కడం ఏంటి? పిచ్చి కాకపోతే! రాయి లేకుండా శిల్పం ఎలా ఉంటుంది?" అని హేళన చేశారు.

కానీ విజయవర్మ కళాపిపాసి. విరించి శక్తి సామర్థ్యాలమీద అపార నమ్మకం ఉందాయనకు. "సరే విరించీ, నీకు కావలసిన వనరులు ఇస్తాను. ఐదేళ్ల గడువునిస్తున్నాను. కానీ సమయం వృధా చెయ్యకుండా నీ పనిని ముగించాలి. నిర్ణీత సమయంలో నువ్వనుకున్నది సాధించకపోతే, సమయమే కాదు వనరులూ నిరుపయోగమవుతాయి. అప్పుడు నేను చేయగలిగేది ఏమీ ఉండదు. రాజ్యపాలకుడిగా వనరులని సద్వినియోగపరచడం నా కర్తవ్యం. కర్తవ్యం ముందు అభిమానాలు నిరుపయోగాలవుతాయని గుర్తుంచుకో." అని హెచ్చరించాడు.

విరించి వినమ్రంగా తలవంచి చక్రవర్తి మాటలను అంగీకరించాడు. "చిత్తం మహారాజా! నాకు ఊరి చివర ఉన్న పాడుబడిన కోటను కేటాయించండి. నా పని ముగిసే వరకు అక్కడికి ఎవరికీ ప్రవేశం ఉండకూడదు. నాకు కావలసినన్ని రాళ్లు, ఇనుప తీగలు పంపండి. ఇప్పటివరకు నా లోకం ఈ రాజభవనం... ఇకపై ఆ పాడుబడిన కోటే నా తపశ్శాల. నా కీర్తిని ఇక్కడే వదిలేసి, ఒక అనామక శిల్పిలా నా అంతిమ సృష్టిలో లీనమవుతాను" అని విన్నవించాడు.

విజయవర్మ సందేహించాడు, కానీ విరించి కళ్ళలోని వెర్రిని, అందులో కనిపిస్తున్న నిజాయితీని చూసి ఒప్పుకున్నాడు.

విరించి ఆ రాజభవన ప్రాసాదాన్ని వదిలి అడుగు బయట పెట్టబోతూ ఆగిపోయాడు. చుట్టూ తను చెక్కిన అద్భుతమైన విగ్రహాలు ఉన్నాయి. వాటిని చూస్తూ "లోకం రాయి రూపాన్ని చూసి మురిసిపోతుంది. కానీ రాయి కేవలం ఒక ఆవరణ మాత్రమే. లోపల ఉన్న ప్రాణాన్ని కప్పి ఉంచే దేహం లాంటిది ఈ శిల. శరీరం కంటే ఆత్మ గొప్పదని తెలిసినప్పుడు, రాయి కంటే నీడ అందంగా ఎందుకు ఉండకూడదు? ఈ రాయి ఒక దేహం అయితే, అది అడ్డుకునే కాంతిలో వికసించే నీడ దాని అంతరాత్మ. దేహం నశ్వరమైనది, కానీ ఆత్మ చిరస్థాయిగా మిగిలిపోతుంది. ఈ గరుకు రాళ్లను సాక్షిగా నిలబెట్టి, స్పర్శకు దొరకని ఆ ఆత్మ సౌందర్యాన్నే నేను శిల్పంగా మలుస్తాను" అని మనసులోనే అనుకున్నాడు.

విరించి ఆ పాడుబడిన కోటలోకి ప్రవేశించాడు. అందులో ఒక పెద్ద గదిని ఎంచుకున్నాడు. ఆ గదికి పైన ఒకే ఒక చిన్న రంధ్రం ఉంది. సూర్యుడు ఆ రంధ్రం మీదకు వచ్చినప్పుడు మాత్రమే వెలుతురు లోపలికి వస్తుంది. మిగతా సమయమంతా ఆ గదిలో మసక వెలుతురే.

విరించి ఆ గదిలో చేరాడు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెంచుకుని తన పని మొదలు పెట్టాడు. అతను విచిత్రమైన ఆకారాల్లో రాళ్లను చెక్కడం మొదలుపెట్టాడు. అవి చూడటానికి అందంగా లేవు. వంకర టింకరగా, ముళ్ళలాగా, విరిగిపోయిన ముక్కల్లా ఉన్నాయి. వాటిని నేల మీద పెట్టలేదు. గది పైకప్పు నుండి వందల సంఖ్యలో సన్నని ఇనుప తీగలను కిందకు వేలాడదీశాడు. ఆ తీగలకు ఈ రాతి ముక్కలను కట్టడం మొదలుపెట్టాడు.

మొదటి రెండేళ్లు నరకంలా గడిచాయి. అతను ఒక రాయిని కట్టేవాడు. మధ్యాహ్నం కోసం ఎదురుచూసేవాడు. రంధ్రం గుండా సూర్యకిరణం పడగానే గోడ మీద పడే నీడను నిశితంగా పరిశీలించేవాడు. అది తను అనుకున్న రూపానికి భిన్నంగా ఉంటే, మళ్ళీ ఆ రాయి కోణాన్ని మార్చేవాడు. వెంట్రుక మందం తేడా వచ్చినా మొత్తం చిత్రం పాడైపోతుందని అతనికి తెలుసు. అందుకే, ఆ ఒక్క క్షణం వెలుగు కోసం రోజంతా రాళ్లతో కుస్తీ పట్టేవాడు.

అతని శిష్యులు అప్పుడప్పుడు భోజనం తీసుకుని వెళ్ళేవాళ్లు. వాళ్ళు ఆ గదిలోకి తొంగి చూసి భయపడిపోయేవాళ్లు. అక్కడ ప్రాణం ఉట్టిపడే విగ్రహాలు లేవు. దెయ్యాల ఎముకల్లా, శవాల గుట్టల్లా పైకప్పు నుండి వేలాడుతున్న రాతి ముక్కలు మాత్రమే ఉన్నాయి. జడలు కట్టినట్లు జుట్టు పెరిగిపోయి, కళ్ళు లోతుకు పోయి ఉన్న విరించి పిచ్చివాడిలా ఆ రాళ్ళ మధ్య తిరుగుతూ, "ఇంకాస్త కోణం మార్చాలి... ఇంకాస్త ఎత్తు తగ్గించాలి," అని తనలో తానే గొణుక్కునేవాడు. ఒకప్పటి శిల్పకళా పారంగతుడు ఇలా శిథిలమైపోతుంటే చూడలేక ఆ శిష్యులు కన్నీరు మున్నీరయ్యేవారు.

ఐదేళ్లు గడిచాయి. జనం అతన్ని మర్చిపోవడం మొదలుపెట్టారు. "విరించికి మతిస్థిమితం పోయింది. రత్నగిరి గర్వించదగ్గ శిల్పి ఇప్పుడు ఏదో చెత్తని పోగు చేస్తున్నాడు," అని ఊరంతా కోడై కూసింది.

ఆ వార్త చక్రవర్తి విజయ వర్మను చేరింది. అసలు విరించి ఏం చేస్తున్నాడో చూడటానికి తన ప్రధాన మంత్రిని పంపాడు. మంత్రి ఆ గదిలోకి వెళ్ళి చూసేసరికి విరించి ఒక మూల ముడుచుకు పడుకుని ఉన్నాడు. గది నిండా గందరగోళంగా రాళ్లు వేలాడుతున్నాయి.

"ఇదేనా నువ్వు ఐదేళ్లుగా చేసింది? ఈ రాతి ముక్కలేనా నీ సాధన? రాజ్యపు వనరులను, సమయాన్ని ఇలాంటి వ్యర్థమైన రాళ్ల కోసం తగలేశావా?" అని మంత్రి అసహ్యంగా అడిగాడు.

విరించి శాంతంగా తలెత్తి, "అవును మంత్రివర్యా, ఇది కేవలం రాళ్లను కట్టడం కాదు. ప్రతి అంశను, కిరణాలు ప్రసరించే ప్రతి కోణాన్ని లెక్కగట్టి ఈ రాళ్లను అమర్చాను. భూమి తిరిగే వేగాన్ని లెక్కగట్టి ఈ తీగల పొడవును నిర్ణయించాను. ఈ రాళ్లు ఆకాశంలోని నక్షత్రాల గమనాన్ని ప్రతిబింబిస్తాయి. కాలచక్రం కదిలినప్పుడల్లా, ఈ నీడ కూడా తన రూపాన్ని మార్చుకుంటూ, సరైన సమయం వచ్చినప్పుడు మాత్రమే ఆ దైవత్వాన్ని ఆవిష్కరిస్తుంది." అని వివరించాడు.

మంత్రి వెళ్ళి చక్రవర్తితో, "మహారాజా! విరించి మతి భ్రమించి పనికిరానివాడయ్యాడు. ఆ గదిలో కేవలం రాతి ముక్కలు తప్ప మరేమీ లేవు. అదొక వ్యర్థ ప్రయాస," అని నిర్మొహమాటంగా చెప్పాడు.

మంత్రి మాటలు విన్న విజయవర్మ తీవ్రమైన వేదనకు లోనయ్యాడు. తాను ప్రాణప్రదంగా అభిమానించిన కళాకారుడు ఇలా మతిభ్రమించి పోవడం ఆయన జీర్ణించుకోలేకపోయాడు. "కాలమే అతనికి సమాధానం చెబుతుంది" అని నిట్టూరుస్తూ, విరించి విషయాన్ని మంత్రి మీదే వదిలేశాడు. అప్పటివరకు రాజభవనం నుండి వెళ్లే ఆహార పానీయాలు, వనరుల సరఫరా మెల్లగా ఆగిపోయాయి. అయినా విరించి ఆ కోటను వదిలి బయటకు రాలేదు. దొరికిన పచ్చికాయలు, దుంపలు తింటూ తన పనిని కొనసాగించాడు. ఆ పాడుబడిన కోట వైపు వెళ్లడానికే జనం భయపడేవారు. అదొక భూతనివాసం అని అందరూ అనుకుంటున్నారు.

కాలం ఎవరి కోసమూ ఆగదు. పదేళ్లు గడిచాయి. కాలప్రవాహంలో కళాపోషకుడైన విజయవర్మ మరణించాడు. అతని కొడుకు శూరవర్మ రాజయ్యాడు. అతనికి కళ అంటే అర్థం కాదు, అతనికి అధికారం, ఆడంబరం ముఖ్యం. దేన్నైనా బంగారంతో కొలవడం అతనికి అలవాటు.

విరించి కూడా ఇప్పుడు పూర్తిగా వృద్ధుడయ్యాడు. అతని శరీరం కృశించిపోయింది. బట్టలు చిరిగిపోయాయి. కానీ అతని కళ్ళలో ఒక వింత మెరుపు ఉండేది. ఆ పదేళ్లలో అతను ఆ గదిలో ఉన్న ప్రతి రాతి ముక్కను అంగుళం అంగుళం కదిలించాడు. బయట ప్రపంచం అతన్ని పూర్తిగా మర్చిపోయింది. కొత్త శిల్పులు వచ్చారు. రత్నగిరి వీధుల్లో కొత్త కొత్త అందమైన విగ్రహాలు వెలిశాయి. జనం వాటిని చూసి మురిసిపోయేవారు. విరించి అనే శిల్పి ఒకప్పుడు ఉండేవాడన్న సంగతి చరిత్రలో కలిసిపోయింది.

ఒకరోజు... విరించి తన పని పూర్తయిందని భావించాడు. అతను ఊరిలోకి వచ్చాడు. జనం అతన్ని గుర్తుపట్టలేదు. ఎవరో బిచ్చగాడు అనుకుని రాళ్లు విసిరారు. అతను నేరుగా రాజభవనానికి వెళ్ళాడు. ద్వారపాలకులు అతన్ని అడ్డుకున్నారు. "నేను విరించిని... శిల్పకళా ప్రవీణుడిని... నా ప్రదర్శన సిద్ధమైంది, " అని అరిచాడు. ఆ మాటలు విన్న ఒక వృద్ధ మంత్రి అతన్ని గుర్తుపట్టాడు.

ఈ వార్త శూరవర్మ చెవిన పడింది. "ఓహో, మా నాన్నగారు చెప్పిన ఆ పిచ్చి శిల్పివి నువ్వేనా? సరే, రేపు ఆ కోటకు వచ్చి నీ పిచ్చి ఏంటో మేమూ చూస్తాం. అది నాకు నచ్చకపోతే, నీ తల ఆ కోట గుమ్మం మీదే తెగుతుంది" అని హెచ్చరించాడు.

మరుసటి రోజు ఉదయం రెండవ ఝాము మొదలై నాలుగు ఘడియలవుతుంది. పాడుబడిన కోట గది మొత్తం జనంతో నిండిపోయింది. శూరవర్మ, మంత్రులు, సేనాపతులు ఆ గదిలోకి ప్రవేశించారు. లోపల దృశ్యం చూసి అందరూ ముక్కున వేలేసుకున్నారు. అక్కడ ప్రాణం ఉట్టిపడే అందమైన విగ్రహాలు లేవు. పైకప్పు నుండి వేల సంఖ్యలో వేలాడుతున్న రాతి ముక్కలు, ముళ్ళు, చెత్త తప్ప ఏమీ లేదు. గాలికి అవి ఊగుతుంటే వికృతంగా, భీతిని కలిగించేలా ఉన్నాయి. వాటిని చూడగానే అందరూ గొల్లున నవ్వారు.

"ఇదేనా నీ పదేళ్ల శ్రమ? ఈ రాళ్ల చెత్తను చూడటానికేనా మమ్మల్ని రమ్మన్నావు?. మా సమయాన్ని, వనరుల్ని మొత్తం వృధా చేసావు." అని శూరవర్మ కోపంగా అరిచాడు.

"ప్రభూ, దయచేసి ఒక్క పావు ఘడియ ఆగండి. కేవలం పావు ఘడియ. సూర్య సిద్ధాంతం ప్రకారం ఆ కాంతి కోణం మారే వరకు నిరీక్షించండి. ఆ పైన ఈ శిల్పం అబద్ధమనిపిస్తే... ఈ తలని మీరే నరికేయండి" అని విరించి మోకరిల్లి ప్రాధేయపడ్డాడు.

శూరవర్మ అయిష్టంగానే ఒప్పుకున్నాడు. అందరూ విసుగుతో ఎదురుచూస్తున్నారు. సమయం ఆసన్నమైంది. సూర్యుడు నెమ్మదిగా ఆ గది పైకప్పుకు ఉన్న రంధ్రం మీదకు వస్తున్నాడు. ఒక సన్నని కాంతి రేఖ గదిలోకి ప్రవేశించింది. అది మొదట నేల మీద పడింది. నెమ్మదిగా ఆ కాంతి పైకి ప్రాకి, గాలిలో వేలాడుతున్న ఆ వికృతమైన రాళ్ళ మీద పడింది.

అద్భుతం! మహాద్భుతం! ఆ క్షణం... మాయాజాలమే జరిగింది.

ఆ వికృతమైన రాళ్ళ మీద కాంతి పడగానే, వాటి నీడలు వెనక గోడ మీద పడ్డాయి. మొదట ఆ నీడలు అస్తవ్యస్తంగా కనిపించాయి. కానీ క్షణాలు గడుస్తున్న కొద్దీ... ఆ వేలాడుతున్న వందలాది రాతి ముక్కల నీడలు ఛాయా గణితంలోని ఖచ్చితత్వంతో ఒకదానితో ఒకటి కలిసిపోయాయి.

గోడ మీద ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మొదట మసకగా... తర్వాత స్పష్టంగా... అక్కడ ఒక స్త్రీ రూపం... కాదు, దివ్యమైన దేవతా రూపం ఆవిష్కృతమైంది. ఆమె కళ్ళలో దయ, పెదవులపై చిరునవ్వు, చేతిలో ఒక పద్మం మరో చేతిలో ఒక పక్షి, పాదాల దగ్గర ఒక సింహం... అన్నీ ఆ నీడలోనే స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతటి సౌందర్యాన్ని ఆ రాజ్య ప్రజలు ఎప్పుడూ చూడలేదు. ఆశ్చర్యం ఏమిటంటే, గాలికి ఆ రాళ్ళు కొంచెం కదులుతుంటే, గోడ మీద ఆ బొమ్మ ఊపిరి పీల్చుకుంటున్నట్లు, ఆమె చీర చెంగు కదులుతున్నట్లు, ఆ పక్షి రెక్కలు విప్పినట్లు అనిపిస్తుంది.

అది ప్రాణం లేని రాయి కాదు. అది ప్రాణం ఉన్న నీడ!

నిశ్శబ్దం. భయంకరమైన నిశ్శబ్దం. ఆ దృశ్యానికి ముగ్ధులై ఆ గదిలో ఉన్న ప్రతి ఒక్కరూ మోకాళ్ళ మీద కూలబడిపోయారు. శూరవర్మ చేతిలో కత్తి జారి కింద పడింది. అతను కళ్ళార్పకుండా ఆ నీడనే చూస్తున్నాడు. ప్రజలు నోరెళ్లబెట్టారు. ఆ వికృతమైన రాళ్లు, అంత అద్భుతమైన సౌందర్యాన్ని ఎలా సృష్టించాయో ఎవరికీ అర్థం కాలేదు. ఆ సౌందర్యం మనిషి సృష్టించింది అని నమ్మలేకపోయారు. అది కేవలం శిల్పం కాదు, అదొక మాయ.

"అద్భుతం! అమోఘం!" అని శూరవర్మ నిశ్చేష్టుడై గొణిగాడు. "విరించీ, నువ్వు మామూలు శిల్పివి కావు... ఇంద్రజాలికుడివి! కంటికి కనిపించని కాంతికి నువ్వు రూపం ఇచ్చావు. నా తండ్రి నీ మీద పెట్టుకున్న నమ్మకం వృధా కాలేదు. నీ ఈ అద్భుత సృష్టికి వెలకట్టడం నా వల్ల కాదు," అన్నాడు శూరవర్మ, ఆ నీడ నుండి కళ్ళు తిప్పుకోలేక.

కానీ విరించి ఆ నీడ వైపే చూస్తూ, చేతులు జోడించి నిలబడ్డాడు. అతని కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి. అతను సాధించాడు. రాయి లేకుండా చిత్రాన్ని సృష్టించాడు.

శూరవర్మ తేరుకున్నాడు. మెల్లగా అతని ఆశ్చర్యం స్థానంలో దురాశ వచ్చి చేరింది. అతని ఆశ్చర్యం ఒక వింత కోరికగా మారింది. ఆ అపురూప సౌందర్యాన్ని తన అంతఃపురంలో బంధించుకోవాలనే స్వార్థం అతని మాటల్లో ధ్వనించింది.

"కానీ విరించీ, ఇంతటి మహత్తరమైన శిల్పం ఈ పాడుబడిన కోటలో ఉండకూడదు. ఇది నా సింహాసనం వెనుక ఉండాలి. దీని వైభవం లోకమంతా తెలియాలి. సైనికులారా! ఈ రాళ్లను ఒక్కొక్కటిగా జాగ్రత్తగా విప్పి, నా అంతఃపురానికి తరలించండి!" అని ఆజ్ఞాపించాడు.

విరించి తడబడుతున్న అడుగులతో అడ్డుపడ్డాడు. "ప్రభూ, ఇది అసాధ్యం. ఆ రాళ్లను, ఆ తీగలను కదిలిస్తే కోణం మారిపోతుంది. నీడ చచ్చిపోతుంది. ఇది ఇక్కడే ఉండాలి, సూర్యుడు ఉన్నంత వరకే ఈ రూపానికి జీవం ఉంటుంది" అని అన్నాడు.

మరో పావు ఘడియ గడిచింది. సూర్యుడు కొంచెం పక్కకు జరిగాడు. వెలుతురు కోణం మారింది. గోడ మీద ఉన్న ఆ అద్భుత సౌందర్యరాశి మెల్లగా కరిగిపోయింది. మళ్ళీ ఆ గోడ మీద గజిబిజి గీతలు, వికృతమైన నీడలు మిగిలాయి.

శూరవర్మ అవాక్కయ్యాడు. ఆ అద్భుతాన్ని కోల్పోవడం అతను భరించలేకపోయాడు. ఆత్రంగా ముందుకు వచ్చి, కరిగిపోతున్న ఆ దేవతామూర్తి ముఖాన్ని పట్టుకోవడానికి గోడను తాకాడు. కానీ అతని చేతికి తగిలింది చల్లటి, గరుకైన రాయి మాత్రమే. కళ్ళకు కనిపిస్తూ, చేతికి దొరకనిది ఏదైనా ప్రపంచంలో ఉందంటే, అది శూరవర్మ కి నచ్చేది కాదు. ప్రపంచంలోని దేన్నైనా తన పాదాక్రాంతం చేసుకోగలననే అహంకారం, ఆ కరిగిపోతున్న నీడ ముందు నీరుగారిపోయింది. దొరకని ఆ సౌందర్యం అతనికి భయంకరమైన అవమానంలా అనిపించింది.

ఆ అద్భుతాన్ని కోల్పోగానే శూరవర్మకు పట్టలేనంత కోపం వచ్చింది. "ఏమైంది? ఆ బొమ్మ ఎక్కడికి పోయింది? మళ్ళీ దాన్ని తీసుకురా!" అని శూరవర్మ ఆజ్ఞాపించాడు.

"ప్రభూ, అది రోజుకు ఒక్కసారి, కేవలం పావు ఘడియ మాత్రమే కనిపిస్తుంది. సూర్యకాంతి ఉన్నంత వరకే ఆ రూపానికి ప్రాణం... కాంతి కదిలితే ఆ దైవం మళ్ళీ శూన్యంలో కలిసిపోతుంది. దాన్ని బంధించడం ఎవరితరం కాదు," అని విరించి నిస్సహాయంగా, భారమైన గొంతుతో చెప్పాడు.

శూరవర్మకు అది నచ్చలేదు. "నాకు ఆ బొమ్మ కావాలి! నాకు శాశ్వతంగా ఆ అందం కావాలి. ఆ రాళ్లను అలాగే అతికించేయండి. వాటిని సరిచేసి ఆ బొమ్మని అలాగే ఉండిపోయేలా చేయండి," అని తన సైనికులను ఆదేశించాడు. సైనికులు ముందుకు వచ్చారు.

"వద్దు ప్రభూ! ఆ రాళ్లను కదిలిస్తే ఆ నీడ చచ్చిపోతుంది!" అని విరించి అరుస్తూ అడ్డొచ్చాడు. సైనికులు అతన్ని పక్కకు తోసేయడంతో అతను గోడకి గుద్దుకుని కింద పడ్డాడు.

కానీ శూరవర్మ వినలేదు. "నాకు నీడ వద్దు, నాకు ఆ రూపం విగ్రహంగా కావాలి," అన్నాడు. సైనికులు ఆ వేలాడుతున్న రాళ్ళను పట్టుకుని కట్టడానికి ప్రయత్నించారు. ఒక తీగ తెగింది. గోడ మీద ఉన్న దేవత ముఖం వికృతంగా మారిపోయింది. మరో తీగ తెగింది. ఆమె చేతిలో పక్షి మాయమైంది. శూరవర్మ కంగారుగా, "జాగ్రత్త! బొమ్మ పాడవుతోంది!" అని అరిచాడు. కానీ అప్పటికే ఆలస్యం అయింది.

సైనికులు ఆ రాళ్లను పట్టుకుని లాగుతుంటే, విరించి శరీరం అదుపులేకుండా కంపించిపోయింది. ఆ ఇనుప తీగలు కేవలం పైకప్పుకు వేలాడుతున్న లోహపు దారాలు కాదు, అవి విరించి ప్రాణనాడులు. ఒక్కో తీగ తెగుతుంటే, విరించి గుండెలో ఏదో నరం చిట్లిపోతున్నట్లుగా గిలగిలలాడిపోయాడు. గోడ మీద ఆ అమ్మవారి రూపం విలవిలలాడుతూ, అవయవాలు తెగిపడినట్లుగా వికృతంగా మారిపోతుంటే, కన్నబిడ్డ తన కళ్ల ముందే కత్తి వేటుకు బలవుతున్న దృశ్యాన్ని చూస్తున్న తండ్రిలా అతను కుప్పకూలిపోయాడు. "వద్దు.. నా అమ్మను చంపకండి! ఆ ప్రాణం తీయకండి!" అని గుండెలు పగిలేలా అరిచాడు. కానీ అతని ఆర్తనాదం ఆ రాళ్ల చప్పుడులో కలిసిపోయింది. నేల రాలిన ప్రతి రాయి, అతని ఆయుష్షును ఒక్కో ఏడాది తగ్గించేస్తున్నట్లుగా, అతని ఆత్మను బద్దలు చేస్తున్నట్లుగా అనిపించింది.

సైనికుల చేతుల్లో చిక్కుకుని తీగలన్నీ తెగిపోయాయి. రాళ్లు ధడేల్ మని కింద పడ్డాయి. గదిలో దుమ్ము రేగింది. గోడ మీద ఉన్న నీడలు మాయమైపోయాయి. ఆ అద్భుతం కళ్ళ ముందే కరిగిపోయింది. గదిలో ఇప్పుడు మిగిలింది కేవలం కిందపడిన రాతి ముక్కలు, పగిలిపోయిన విరించి గుండె మాత్రమే.

శూరవర్మ కోపంతో రగిలిపోతూ, విరిగిపడి ఉన్న ఆ రాళ్ల కుప్పను తన్నాడు. "వీడు ఒక పిచ్చివాడు! కళ పేరుతో మనల్ని ఇన్నాళ్లూ మోసం చేశాడు. మనకు చూపించింది కేవలం గారడీ విద్య... కంటిని కప్పే ఒక కనికట్టు మాత్రమే! నిజమైన శిల్పి అయితే ఆ అందాన్ని రాయిలో బంధించి శాశ్వతం చేసేవాడు. కానీ ఈ మూర్ఖుడు గాలితో, నీడలతో ఆటలాడాడు. చేతికి దొరకనిది, నిలకడ లేనిది ఒక కళ ఎలా అవుతుంది? కేవలం వెలుగు ఉన్నంత వరకే బతికే ఈ నీడ కోసం పదేళ్ల కాలాన్ని వృథా చేశాడు," అని ఈసడించుకున్నాడు.

విరించి వైపు అసహ్యంగా చూస్తూ, "ఒక అద్భుతమైన విగ్రహాన్ని చెక్కుతావని ఆశిస్తే, ఇలాంటి పనికిరాని రాళ్లను ఏరుకొచ్చి కాలయాపన చేశావా? అసలు నిన్ను ఈ కోటలోకి రానిచ్చినందుకు, నీలాంటి వాడిని శిల్పి అని పిలిచినందుకు మా రాజవంశమే సిగ్గుపడాలి," అని తిట్టి, తన పరివారంతో కలిసి విర్రవీగుతూ వెళ్ళిపోయాడు.

విరించి నెమ్మదిగా నేల మీద కూర్చున్నాడు. చుట్టూ పడి ఉన్న రాతి ముక్కలు అతనికి తనతో పాటు ఈ దశ వరకు నడిచిన నిశ్శబ్ద సహచరుల్లా కనిపించాయి. “ఇదేనా నేను కోరుకున్నది?” అని తనను తానే ప్రశ్నించుకున్నాడు. “పదేళ్లుగా వెతికిన ఆ క్షణం ఒక పావు ఘడియ మాత్రమే నిలిచింది. కానీ ఆ ఒక్క క్షణంలోనే నేను చూడాల్సినదంతా చూశాను. రూపం నిలవాలి అనుకున్న రోజుల్లో నేను శిల్పిని. రూపం కరిగిపోయినా అనుభూతి మిగులుతుందని తెలిసిన రోజే జీవితానికి అర్థమేమిటో తెలుసుకున్నాను. నన్ను చూసి పిచ్చివాడన్నారు, మోసగాడన్నారు. కానీ నేను ఎవ్వరినీ మోసం చేయలేదు. నేను కేవలం దివ్యత్వాన్ని చూపించాలనుకున్నాను... చూపించాను. ఇంతటితో సరి. ఇక నాకు ఏమీ అవసరం లేదు,” అని అనుకుని అలసటతో కళ్ళు మూసుకున్నాడు.

ఆ రాత్రి విరించి ఆ రాళ్ల మీద తల పెట్టుకుని శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. అతని ప్రాణం పోయినా, అతని కళ్లు మాత్రం సగం తెరుచుకునే ఉన్నాయి. అవి ఆ పైకప్పుకున్న రంధ్రం వైపే చూస్తున్నాయి... బహుశా అతను స్వర్గానికి వెళ్ళడం లేదు, ఆ కాంతి కిరణం ద్వారా అనంతంలోకి ప్రయాణిస్తున్నాడేమో.

సంవత్సరాలు గడిచాయి. రత్నగిరి రాజ్యం పతనమైంది. కానీ, ఆ పాడుబడిన కోట మాత్రం అలాగే మిగిలిపోయింది. ఆ కోటలో విరిగిపడి ఉన్న రాళ్ల మీద సూర్యకాంతి పడినప్పుడు, గోడ మీద ఒక అస్పష్టమైన దేవత బొమ్మ కనిపిస్తుందని చెప్పుకునేవారు.

వందల ఏళ్లు గడిచాయి. ఆ కోట శిథిలమైపోయింది. గోడలు కూలిపోయాయి. కానీ విరించి అమర్చిన ఆ రాళ్లలో రెండు మూడు రాళ్ళు మాత్రం, పైకప్పు నుండి వేలాడుతున్న ఒక తుప్పు పట్టిన ఇనుప తీగకు అలాగే వేలాడుతూ ఉన్నాయి. మిగిలినవన్నీ కింద పడి మట్టిలో కలిసిపోయాయి.

ఒకరోజు మధ్యాహ్నం 12 గంటలయ్యింది. దాగుడుమూతలాడుతూ దాక్కోవడానికి వచ్చిన ఒక చిన్నపిల్లవాడికి, అక్కడ వేళ్ళాడుతున్న రాళ్ల మీద పడిన కాంతి, గోడ మీద ఒక చిరునవ్వులా కనిపించింది... తన అమ్మ నవ్వులా! వెంటనే ఆ పసివాడు స్వచ్ఛంగా నవ్వాడు.

ఆ పసివాడి నవ్వు ఆ కోట గోడల్లో ప్రతిధ్వనించింది. బహుశా ఆ నవ్వులో విరించి ఆత్మ తన తపస్సుకు సార్థకతను పొందిందేమో! అందుకే ఇప్పటికీ ఆ కోటలోకి వెళ్లిన వారికి గాలిలో సన్నగా ఎవరిదో శ్వాస వినిపిస్తుంది. అక్కడ విరించి ఆత్మ, ఇంకా ఆ శూన్యాన్ని శ్వాసిస్తూ కాంతిని చెక్కుతూనే ఉందని జనం నమ్ముతారు.

★★★

COMMENTS